క్లుప్తంగా

ఘనంగా నర్సింగపాడు ఆలయ వార్షికోత్సవం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పమిడిమర్రు శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయ ప్రదక్షిణలో పాల్గొన్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, రుద్ర హోమం, చండీ పారాయణం తదితర పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని, స్వామిని విశేషంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అచ్చంపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.స్వరూప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి ఎంపీపీ భూక్యా రజనీబాయి అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారన్నారు.

లంకెలకూరపాడులో పోలేరమ్మ తల్లి కొలుపులు

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో పోలేరమ్మతల్లి గ్రామదేవత కొలుపులు గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పూజ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొలుపులు ఈ నెల 27వ తేదీతో ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జగనన్న లేఅవుట్ల పరిశీలన



సత్తెనపల్లి: పక్కా గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి కోరారు. సత్తెనపల్లి పట్టణంలోని పేదలకు సత్తెనపల్లి మండలం గండ్లూరు–1, గండ్లూరు–2, భీమవరం, ధూళిపాళ్ల వద్ద కేటాయించిన లేఅవుట్లను గురువారం పరిశీలించారు. గృహ నిర్మాణ కాంట్రాక్టర్లకు ఇంజినీరింగ్ సెక్రటరీ లకు పలు సూచనలు చేశారు. పక్కా గృహ నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణ లబ్ధిదారులకు సిబ్బంది సహకరించాలన్నారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోండి



క్రోసూరు: గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఝాన్సీలక్ష్మి కోరారు. క్రోసూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని వివరించారు. గ్రంథాలయానికి ప్రతి రోజు రావటం అనేది దినచర్యగా అలవర్చుకోవాలని సూచించారు. అదే విధంగా గ్రంథాలయంలో తెలుసుకున్న విషయాలను గుర్తుంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై.వీరాంజమ్మ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఆదర్శం.. శిక్షణ స్ఫూర్తిదాయకం



దాచేపల్లి మోడల్ పాఠశాల భవనం

- జిల్లాలోని మోడల్ పాఠశాలల్లో 72 శాతం ఉత్తీర్ణత
- ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- జూన్ 6వ తేదీ వరకు అవకాశం

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ(మోడల్) పాఠశాలలను ప్రారంభించింది. విద్యార్థుల ఉక్కు సంకల్పం, ఉపాధ్యాయుల అంకితభావంతో ఈ పాఠశాలలు సరి కొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాయి. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని 14 మోడల్ పాఠశాలల్లో 1,152 మంది పరీక్ష రాయగా 831 మంది ఉత్తీర్ణులయ్యారు. 72 శాతం ఆదర్శ పాఠశాలలు ఫలితాలను సాధించింది.

అన్ని వసతులతో..

జిల్లా వ్యాప్తంగా 14 ఆదర్శ పాఠశాలలున్నాయి. విశాలమైన తరగతి గదులు, సౌకర్యాలతో కూడిన వసతులు, కంప్యూటర్ గది, గ్రంథాలయం, ప్రత్యేక తరగతులు, పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం. విద్యార్థి అభిరుచికి అనుగుణమైన శిక్షణ ఇలా అన్నింటిలో వైవిధ్యం చాటుకుంటున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో సుమారు 20 మంది ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ, తల్లిదండ్రులతో ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసి వారిలో స్ఫూర్తిని రగిలించడంతో విద్యార్థులు చక్కగా రాణిస్తున్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం...

ప్రభుత్వం ఆదేశాల మేరకు పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఈనెల 22వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పది పూర్తి అయిన విద్యార్థులకు ఎక్కువగా అవకాశం. సీట్లు మిగిలిపోతే ఆ తర్వాత వరుసలో ఉన్న విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 25వ తేదీ గడువు ముగిసింది. ప్రవేశ పరీక్ష జూన్ 11వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక మెరిట్‌తో పాటు రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలోని మోడల్ పాఠశాలల్లో టెన్త్ ఫలితాలు ఇలా...

మోడల్ పాఠశాల	టెన్త్ విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
ఈపూరు	80	64	80
బొల్లాపల్లి	62	38	61
వినుకొండ	92	86	93
చిరుమామిళ్ళ	80	69	86
దాచేపల్లి	89	72	81
దేచవరం	81	56	69
దుర్గి	94	72	77
గురజాల	86	48	56
జెట్టిపాలెం(గోలి)	58	23	40
కారంపూడి	94	65	69
క్రోసూరు	80	69	86
నూజండ్ల	85	50	59
వెల్దుర్తి	83	54	65
విప్పర్లరెడ్డిపాలెం	65	88	74
మొత్తం	1,152	831	72

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

మోడల్ పాఠశాలలో ఉత్తమ ఫలితాల సాధనకు కలిసి కట్టుగా కృషి చేస్తున్నాం. అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్ల ఉత్తమ ఫలితాలు సాధ్యమౌతున్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను చక్కగా చదివి అర్థం చేసుకొని పరీక్షల్లో రాసి ఉత్తీర్ణత సాధిస్తున్నారు.

–పాదిలి నరసింహారావు,
సూపరింటెండెంట్,
మోడల్ పాఠశాలలు, పల్నాడు

ఘనంగా పెద్దింటమ్మతల్లి వార్షికోత్సవాలు

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతిలోని గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి కుంకుమార్చనలు ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు శ్రీలక్ష్మీగణపతి హోమం, శక్తిదుర్గా చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యే పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అలయ అర్చకులు ఎమ్మెల్యే శంకరరావు ఆశీర్వచనంతో పాటు శేషవస్త్రాన్ని అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి దేవాలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మా విజయసాగర బాబు పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తదితరులు

'ఫ్యామిలీ డాక్టర్'తో ప్రజల వద్దకు వైద్యం

సత్తెనపల్లి: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం గోరంట్లలో డాక్టర్ సాయి తేజారెడ్డి గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 209 మందికి పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక వ్యాధుల తో బాధపడుతూ నడవలేని వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎలిజబెత్, ఏఎన్‌ఎంలు వై.పాప,జె. సరళకుమారి, హెల్త్ అసిస్టెంట్ జె.బాబు, డీఈఓ ఇజ్రాయిల్ పాల్గొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం భట్లురు గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి యు.శ్రీలక్ష్మీ కవిత పరీక్షలు నిర్వహించారు. మొత్తం 290 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కె.ధనలక్ష్మి, ఏఎన్‌ఎం కె.రోశమ్మ, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, డీఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

బీరవల్లిపాయలో..

రాజుపాలెం: మండలంలోని బీరవల్లిపాయలో ఫ్యామిలీ డాక్టర్ గురువారం వైద్య సేవలు అందించారు. డాక్టర్ రవితేజనాయక్ 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన వారి ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఇంటి వద్దే కావాల్సిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అలేఖ్య, ఆపరేటర్ చెవుల పూర్ణచంద్రరావు, ఏఎన్‌ఎం ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ షాదిక్ హుసేన్ పాల్గొన్నారు.



గోరంట్ల గ్రామంలో ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయి తేజారెడ్డి

విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

అచ్చంపేట: విత్తన, ఎరువుల దుకాణా డీలర్లు ఎమ్మార్పీకి మించి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ షేక్ సుగుణాబేగం హెచ్చరించారు. స్థానిక విత్తన, ఎరువుల దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ప్రతి దుకాణంలో తప్పనిసరిగా స్టాక్ బోర్డు, ధరల పట్టిక ఉంచాలన్నారు. కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని చెప్పారు. ప్రతి సీడ్స్‌కు సంబంధించి కంపెనీల నుంచి ప్రిన్సిపల్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఏరోజుకు ఆ రోజు ఫాం డి రూపంలో స్టాక్ రిపోర్టులను ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టార్, పీసీలు, అమ్మకానికి సిద్ధంగా ఉంచిన విత్తనాలు, ఎరువులు పరిశీలించారు. రైతులు లైసెన్సులున్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అధిక ధరలకు విక్రయించే వారి సమాచారాన్ని ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్టి విత్తనాలు జీలుగ, పిల్లి పెసర, జనుము విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

విత్తనాల దుకాణాలు తనిఖీ

క్రోసూరు: క్రోసూరులోని విత్తనాల షాపులను వ్యవసాయధికారులు ఏడీఏ వి.హనుమంతరావు, ఏఓ వేణుగోపాల్ గురువారం తనిఖీ చేశారు. విత్తన డీలర్లు సదరు విత్తనాల రకాలు, నిల్వలు, ధరలను సూచించే బోర్డు అందరికీ కనబడే విధంగా పెట్టాలన్నారు. రోజువారీ విక్రయాలు, కొనుగోళ్ల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. విత్తనాల డీలర్లు విత్తనాలను అధిక ధరలకు విక్రయించటం, కృత్రిమ కొరత సృష్టించటం చేయరాదన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినపుడు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని, బిల్లులో కొనుగోలు చేసిన విత్తనాల వివరాలు, బ్యాచ్, లాట్ నంబర్లు అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. అదే విధంగా పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రపరుచుకోవాలన్నారు. విత్తనాల మొలక శాతంలో, నాణ్యతలో తేడాలు గుర్తించినట్లెతై స్థానిక వ్యవసాయధికారికి వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు.



విత్తన దుకాణాలలో స్టాక్ రిజిస్టర్స్ తనిఖీ చేస్తున్న ఏఓ సుగుణాబేగం

ఎస్‌బీఐ పథకాలపై రైతులకు అవగాహన

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెంలో గురువారం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులతో రైతులకు తమ బ్యాంకు నిర్వహిస్తున్న పలు రకాల రైతు పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రంగా విగ్రహ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బ్యాంకు రీజనల్ మేనేజర్ రామ్‌కుమార్, గౌరవ అతిథులుగా సేల్స్ మేనేజర్ బాలాజీ, సీఎం క్రెడిట్ అధికారి రాము, వెలుగు ఏపీఎం సలీం పాల్గొన్నారు. కార్యక్రమానికి బ్యాంకు మేనేజరు రామిరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం గ్రామంలోని రైతులను వెలది అప్పారావు, నీరుకొండ కోటేశ్వరరావు,గల్లాగురుపాదం, నీరుకొండశ్రీనివాసరావు తదితరులను బ్యాంకు అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ మేనేజరు నిర్మల్‌బాబు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



రైతుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ అధికారి

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ రష్మిని అభినందించిన ఎమ్మెల్యే

మంగళగిరి: ఇటీవల విడుదల చేసిన టైప్ హయ్యర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటిస్థానం సాధించిన నగరంలోని జగనన్న కాలనీకి చెందిన బిట్రా రష్మిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అభినందించారు. గురువారం ఆయన రష్మి నివాసానికి వెళ్లి రూ.10వేల ప్రోత్సాహక నగదును అందజేయడంతో పాటు సత్కరించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు విద్యార్థులు చదువుల్లోనూ, క్రీడల్లోనూ విశేషంగా రాణించి మంగళగిరి పేరును రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో నిలపడం మనందరికీ గర్వకారణమన్నారు. నగరంలోని వీజే కళాశాలలో చదివిన రష్మి ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 857 మార్కులు సాధించి ఎంసెట్ పరీక్ష రాసిందని, అందులో ర్యాంక్ వస్తే ఇంజినీరింగ్ చదువులకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని ఎమ్మెల్యే ఆర్కే హామీనిచ్చారు.



రష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

యువకుడికి గాయాలు

నకరికల్లు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు గాయపడిన ఘటన స్థానిక అద్దంకి– నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. నకరికల్లు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం షడన్‌బ్రేక్ వేయడంతో దాని వెనుక ఉన్న కారు కూడా షడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో కారు వెనుక ఉన్న స్కూటీ అదుపు తప్పి పడడంతో స్కూటీ నడుపుతున్న యువకుడు కె.రామిరెడ్డికి గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రుడిని నకరికల్లు 108లో నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

వలంటీర్లే ప్రభుత్వ సారథులు

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- వలంటీర్లకు అవార్డులు అందజేత

అమరావతి: ప్రజల వద్ద పాలనను తీసుకెళ్లే గ్రామ సచివాలయ వలంటీర్లే ప్రభుత్వానికి సారథులని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండల కేంద్రమైన అమరావతి శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. జీతం కోసం కాకుండా సేవాభావంతో పని చేస్తున్న వలంటీర్లను గుర్తించి వారిని సత్కరించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సంకల్పం గొప్పదని చెప్పారు. జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ముందుకు సాగుతుందని వివరించారు. జగనన్న చేకూర్చుతున్న లబ్ధిని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. మండలంలో ఉన్న 286 మంది వలంటీర్లకు రూ.29.30 లక్షల మంజూరు చేయటం జరిగిందన్నారు. నియోజవర్గం అభివృద్ధిలో కోట్ల రూపాయల ఖర్చుతో రోడ్లు వేస్తున్నామన్నారు. మాదిపాడు, ముక్త్యాల మధ్య కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణం, అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు త్వరలో మొదలు పెడతామని చెప్పారు. వలంటీర్లలో ఒకరికి సేవావజ్ర, మరో ఐదుగురికి సేవా రత్న, 280 మందికి సేవామిత్ర పతకాలతో పాటుగా శాలువాలు కప్పి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ నాయకుల సమక్షంలో సన్మానించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ చైర్మన్ వెంపా జ్వాల లక్ష్మీనరసింహారావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ హాష్మీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, అమరావతి, ధరణికోట, మునగోడు సర్పంచులు రాజేశ్వరి, మాదాసు పావని, బంకా విష్ణు వైఎస్సార్ సీపీ నాయకులు ఎ.శ్రీనివాసరెడ్డి, చిలకా సాంబయ్య, విన్నకోట సాంబశివరావు, ఎంపీడీఓ మాధురి, ఈఓపీఆర్డీ ప్రసాదరావు పాల్గొన్నారు.



అమరావతిలో సన్మానించిన వలంటీర్లతో ఎమ్మెల్యే శంకరరావు



వెలితోటి చిన్నబాబుకు సేవవజ్ర పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ప్రజలకు మంచి చేసే సేవకులు వలంటీర్లు

పెదకూరపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేదలకు మంచి చేసే సేవలకులు వలంటీర్లు అన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన వలంటీర్లు సేవా పురస్కారాలు అందజేత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా మండలంలోని పాడపాడు గ్రామాన్నికి చెందిన వలంటీర్లు వెలితోటి చిన్నబాబుకు సేవా వజ్ర పురస్కారం కింద రూ.30వేలు నగదు అందించి సత్కరించారు. అనంతరం ఐదుగురుకు సేవా రత్న కింద రూ.20వేలు, 194 మందికి సేవ మిత్ర పురస్కారం కింద రూ.10నగదుతో పాటు సత్కరించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, గ్రామ సర్పంచి గుడిపూడిరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, జిల్లా పార్టీ నాయకులు కంకణాల శివాజీ, మాగులూరి అనిల్, ఎంపీడీఓ నరసింహారావు పాల్గొన్నారు.

కల్యాణం... కమనీయం



కనుల పండవగా భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం

పెదకూరపాడు: పెదకూరపాడులోని కన్యకం బాదేవీ ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణం కనులపండవగా జరిగింది. స్వామి వారి కల్యాణ మహోత్సవం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సేవాభావంతో పనిచేసే వలంటీర్లకు గుర్తింపు

నకరికల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నకరికల్లులోని వలంటీర్లను గురువారం ఘనంగా సన్మానించారు. నకరికల్లులో దాదాపు 50 మంది వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేచారపు అనూరాధ, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, గ్రామ కార్యదర్శి అరుణప్రియ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంక్ ప్రారంభం

నకరికల్లు: గ్రామస్తులకు, వాహనదారులకు, ప్రయాణికులకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పేర్కొన్నారు. నకరికల్లు పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన నిర్మించిన తాగునీటి ట్యాంకును గురువారం ప్రారంభించారు. అనంతరం మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డిని, కార్యదర్శి అరుణ ప్రియను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, పరసా సాంబయ్య, షేక్ సలీల్, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, మారెళ్ల శ్రీనివాసరావు, సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ముజావర్ జాన్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఎండీఎస్ దర్శి నియోజకవర్గ అధ్యక్షుడిగా టైటస్



సత్తెనపల్లి: మహాజన దళిత సమితి(ఎండీఎస్) దర్శి నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రకాశం జిల్లా దర్శి పట్టణానికి చెందిన గోల్లపాటి టైటస్ నియమితులయ్యారు. ఈ మేరకు మహాజన దళిత సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దీపాల పరంధామయ్య గురువారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీఎస్ రాష్ట్ర కార్యదర్శి జమండ్లమూడి ప్రభాకర్, బాపట్ల, ప్రకాశం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ శాంతి రాజు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అవస్థలు



చాగంటివారిపాలెం సమీపంలో గాలులకు విరిగి అడ్డంగా పడిన చెట్టు



ముప్పాళ్ల సమీపంలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



సత్తెనపల్లి-నరసరావుపేట రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

ఆకాశం మేఘావృతంతో పాటుగా భారీ ఈదురుగాలులకు మండలంలోని పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఎండ వేడిమి నుంచి కొద్దిసేపు ఉపశమనం లభించినప్పటికీ ఈదురు గాలుల బీభత్సంతో ప్రజలు అవస్థలు పడ్డారు. సత్తెనపల్లి- నరసరావుపేట ప్రధాన రహదారిపై చాగంటివారిపాలెం, మాదల, గోళ్లపాడు, ఇరుకుపాలెం గ్రామాల వద్ద రహదారి పక్కనే ఉన్న పెద్దపెద్ద చెట్లు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మాదల సమీపంలో హోర్డింగ్‌లు వంగిపోయాయి. ముప్పాళ్లలోని కాలువ సమీపంలో దుకాణం ఈదురుగాలులకు తిర గపడటంతో కొంత ఆస్తి నష్టం వాటిల్లింది. రహదారిపై అడ్డుగా ఉన్న చెట్లను పోలీసులు స్థానికుల సాయంతో క్రేన్‌తో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. –ముప్పాళ్ల